# సాహిత్యవీథిలో ఓ సాయంకాలం

సాహిత్యం సామాన్యం కాదు; సాంబశివంమాత్రం సామాన్యుడే - ఆమాటకొస్తే అతిసామాన్యుడూ బహుసామాన్యుడూను!

అసలితడు కల్లోనైనా అనుకోని దుస్సంఘటన అది...అదే, సామాన్యుడు సాంబశివం సాహిత్యవీధిలో పడ్డం.

అనగా అనగా - అనుకోకుండా సాహితీ రథసారథులు సగంమందికి పైగా సమావేశమైనసభలోకి సాంబశివం ప్రవేశించి సాధనచిత్తుడై ఓ సాయంకాలం వృథా చేసుకున్నాడు. ఆ సంఘటనద్వారా తాను సాహిత్యవీధిలోకి వెళ్ళినట్టు అనుకున్న సాంబశివం, ఆవీధిలోనుండి వీలయినంత వేగిరంగా వెనక్కిమళ్లి "మళ్లీ అటు వేపు పోకుండా కాపాడు దేవుడా!" అని ప్రార్థించుకున్నాడు; ఆంజనేయదండకాన్ని ఆరుసార్లు వల్లించుకున్నాడుకూడా.

సాంబశివం మిత్రుడు 'సుర' (సుందరం కలం పేరు) ఒకరోజు సాంబశివం యింటికి వచ్చాడు. అప్పుడే గడియారం ఆరుకొడుతూ వుంది. గుమాస్తా సాంబశివం, మానవుడు సాంబశివంగా మారుతుండే వేళ. అతడిలో అంతవరకూ వున్న యాంత్రికశక్తి పోయి మానవశక్తి ప్రవేశించే సుముహూర్తం.

"ఏమోయ్ సాంబం! ఇవాళ ఎక్కడికి వెళ్తున్నావ్?"

"ఎక్కడికీ వెళ్లనోయ్! ఇంట్లోనే వుంటా."

"అయితే నాతోబాటురా. ఆ ప్రక్కవీధిలో 'రమామహల్లో' మహాకవి - గారి జయంతి జరుగుతోంది. ప్రఖ్యాత రచయితలూ రచయిత్రులూ వస్తారు. కమ్మని కావ్యరసం పోస్తారు చెవుల్లో. పోదాం పద!"

ఈ - యితలూ - యిత్రులూ - వీళ్ళ పేర్లని సాంబశివం పత్రికల్లో చూచేవాడే కాని ఎప్పుడూ కళ్ళారా చూడలేదు వారిని. ఈ పెద్దవాళ్ళు అర్థరహితం ఆడంబరం అని తిడుతుండే గేయాల పుస్తకం ఒకటి సాంబశివం చదవడం తటస్థించింది. వాటిలో నాయకుడు తనే వనుకుని ఒకటో రెండో గీతాల్ని ఎలాగో బట్టీ పట్టేశాడు. ఆఫీసరు ఫైళ్లను ఇంటికి తీసుకువెళ్లమన్నప్పుడూ, ఆదివారం పూట ఆఫీసుకు రమ్మన్నప్పుడూ—సాంబశివం ఆ గేయాలని సమయానికో రాగంతో రోజుకో రీతిగా పాడుకునేవాడు. ఇవి తప్పించి పత్రికలు చదవడం తప్ప సాహిత్యంతో ఎలాటి సంబంధమూ లేనివాడు సాంబశివం. ఇలాటివాడు ఆరోజు సాయంత్రం దురదృష్టవశాత్తు హోంవర్క్ ఫైళ్ళేమీ లేనందున 'సుర'తో 'రమామహల్' చేరాడు.

"రమా మహల్" 'సినీ రమా'లా కనుపించింది సాంబానికి. గుమ్మంలో చెప్పులూ, గుమ్మానికి ఎదురుగా హాల్లో మూడు కుర్చీలూ, కుర్చీలకూ చెప్పులకూ మధ్య చాపలూ - చాపలమీద చిందరవందరగా ఓ పది క్రాపు తలలూ, కుడివేపు ఓ ప్రక్కగా ఓ అరడజను కనకాంబరం, మల్లె, మొదలయిన పూలఅంగళ్లూ...ఇదీ 'లాంగ్ షాట్'లో ఓపెనింగ్ సీన్. సాంబం సుందరం వెళ్ళి ఎడమప్రక్కగా

## వాకాటి పాండురంగరావు

ఆసీనులయారు. ఉన్న వారందరూ ఇద్దరూ ముగ్గురూగా గుమికూడి సాహిత్యాన్ని గురించి కాబోలు సిగరెట్టుపొగ వుంగరాల క్రింద మాటాడుకుంటున్నారు. ఇదేదో ఇవాళ పూర్తిగా స్టడీ చేసెయ్యాలని అశోకుడినాటి రాతిశాసనం చేతికందినట్లు నాలుగు కళ్ళూ ఎనిమిది చెవులూగా వున్నాడు సాంబశివం.

"సంగీతానికి సరిగమ పదనిస లెటువంటివో సాహిత్యానికి భాష అటువంటిది" - అన్నది సాంబశివంయొక్క గుమాస్తా బుర్రలో గూడుకట్టుకున్న బుల్లి నిర్వచనం. దాని నిజానిజాలు ఇవాళ తేలిపోతాయి కదా అన్న ఆతురతతో వున్నాడు సాంబం.

"ఓహో 'సుర'గారా! ధన్యోస్మి!... మీరు మొన్న 'దేవి'లో వ్రాశారే 'వైతాళికుడు'..అది మరీ అంత 'మెటాఫిసికల్'గా వుందేమండీ?" అని సుందరాన్ని ఆ ప్రక్కన వున్న పొడుగు మొహం ఆయన అడగడం సాంబశివం విన్నాడు.

"అబ్బే! ఏదో రాశాను...హిహిహి- అంతే! నాక్కూడా తెలీదు ఎప్పుడు ఎందుకు ఆవిధంగా రాస్తానో.. హీహీ..." అన్నాడు సుందరం. "ఏడిచాడు" అని సాంబం మస్తిష్కంలో మౌనవ్యాఖ్యానం.

జనం పోగవుతున్నారు. అయినా—ఆడా మొగా కలిపి యాభైమందికన్నా ఎక్కువలేరు. సాహిత్యానికి సమ్మర్దం సరిపడదేమో అనుకున్నాడు సాంబం. ఆ జనంలో నెరిసిపోయిన వెంట్రుకలూ- రంగు పూసిన మీసాలూ గల ఒక యాభైఏళ్ళాయనను చూపించి సుందరం "ఆయనే రామనాథంగారు. 'సరళి' పత్రికా సంపాదకుడు; ఇవాళ సభకి అధ్యక్షుడు" అన్నాడు సాంబంతో. రామనాథం గారిని లోకమంతా ఎరుగును; సాంబశివ మూ లోకంలో ఒకడే గా.

ఇంతలోకే 'కళుక్'మన్న నవ్వుశబ్దం- దేవాలయ గర్భగృహద్వారం మీది చిరుఘంటలా—వినిపించింది.

సాంబశివం కండ్లు కుడివైపుకు తిరిగాయి. కాస్త పెద్దగావున్న తెల్లటిపళ్ళవరసా—నవ్వకుండావుంటే బాగుండు ననిపించే నోరూ—ఎడమబుగ్గమీద చిన్నమచ్చా—వెడల్పయిన నుదురూ—సముద్రపు నురుగులాటి చీరా...వీటితోబాటు యువతి కనపడింది. అందంగా లేకపోయినా ఆకర్షణ వున్న మూర్తి ఆవిడది.

"ఆవిడ ఎవరూ?"— సుందరాన్ని సాంబం అడిగాడు.

అదివరకే అటు తిరిగివున్న సుందరం, "ఆవిడా?...ఆవిడ పేరే 'సుకుమారి;' 'నాయిక' పత్రికాసంపాదకుడి కుడిభుజం" అని సంగ్రహంగా పరిచయం చేశాడు

"మరి—ఆ సంపాదకుడి ఎడమభుజం మగవా ఆడదా?" అన్న ప్రశ్న బయలుదేరి నప్పటికీ, అణిచి పెట్టేశాడు సాంబశివం.

ఇంతవరకూ క్రమంగా హెచ్చుతూండిన శబ్దం కాస్త తగ్గుముఖం పట్టింది. ఎదురుగానున్న మూడు కుర్చీలలో మధ్యది శ్రీ రామనాథంగారిచే అలంకరింపబడింది. ఎవరో ఒక తెల్లఖద్దరులాల్చీ ఆయన... స్త్రీలవేపుతిరిగి, పదిమంది ప్రమదలచే పరివేష్టిత అయిన 'సుకుమారి' వైపుచూచి "సుకుమారిగారూ! రండి!" అంటూ రామనాథంగారి కుడివైపుకుర్చీ చూపించారు.

"అబ్బే...హుహుహూ—" అని తెచ్చిపెట్టుకున్న సిగ్గుతో, 'మరాళనృత్యం' చేసిన సోవియట్ 'ప్రైమా బాలెరినా'లా దేహాన్ని—సగమంటే సగానికి కుదించేసు



గాజుల బత్తుడు

—ఫోటో : లక్ష్మణ్, వరంగల్లు.

## ★ సాహిత్య వీధిలో ఓసాయంకాలం ★

కుని కుర్చీలో కూలబడింది సుకుమారి. కూర్చున్న స్థలంనుండి కుర్చీకి వున్న దూరం నడవడంలో సుకుమారి దేహం వంగిన వంకరలు. "మనం వాట్లు సభకి వచ్చావా?"

అన్న సంకేతాన్ని కల్గించేయి సాంబశివానికి

అప్పుడే ఓ కట్టపుస్తకాలూ కాగితాలూ చేత్తో పట్టుకుని ప్రవేశించాడు ఒకాయన. శ్రీహలాంగా పొడుగుకోటూ బిగుతైన పైజమా వేసుకున్నాడు. ఆయన్ని ఖాళీగా వున్న ఎడమవైపు కుర్చీలో కూర్చోబెట్టి— ఇందాక సుకుమారిని ఆహ్వానించిన ఖద్దరు లాల్చీ మనిషి "మహాజనులారా!" అన్నాడు. "ఓహో ఈయనే సభానిర్వాహకుడు కాబోలు" అని ఆ మహాజనులలో ఒక అణువుగావున్న సాంబశివం అనుకున్నాడు

"మహాజనులారా! ఇవాళ ఎంతో సుదినం. మహాకవి-గారి జయంతి జరుపుతున్నాం. ఆయన రచనలను రసించిన సహృదయు లందరూ ఆయన జ్ఞాపకార్థం ఓ సమితిగా ఏర్పడి ఆయన ఆదర్శాలను ప్రచారం చేయడానికి పూనుకోవాలి. అందుకే ఈ సభ నేర్పాటు చేశాం. ఎన్నో పనులున్నప్పటికీ ఈ సభకి విచ్చేసిన—జగమెరిగిన బ్రాహ్మణులు శ్రీరామనాథంగారిని అధ్యక్షులుగా ఉండమని ప్రార్థిస్తున్నా.....మంచిభాషా ప్రవేశమూ, సంస్కారహృదయమూ గల శ్రీమతి సుకుమారిగారు, 'మహాకవిగారు చిత్రించిన స్త్రీపాత్రలను' గురించి ఉపన్యసిస్తారు. అటుతర్వాత సాహిత్యంలో సాటిలేని కృషి సలిపిన శ్రీ బృందావన్ గారు (శ్రీహలాకోటాయన) కవిగారి-శయ్యల్ని గురించి ప్రసంగిస్తారు" అని కార్యనిర్వాహకుడుగారు ఊరుకున్నారు.

రామనాథంగారు లేచి నిలబడ్డారు. ఆగ్నేయదిశకు ఓసారి చూశారు; సాంబశివం కూడా అటుచూశాడు. ఏమీ కనుపించ లేదు ఒక్క పాలెగాడు తప్ప! సాహిత్య సమావేశానికి పాలెగాడుకి అర్థం లేదా లేదని మొండికేసింది సాంబం మెదడు. అప్పుడే నిద్రనుంచి లేచివచ్చిన ధోరణిలో సాగింది అధ్యక్షోపన్యాసం

" . బహుశా 1911లో కాబోలు— నేను, మహాకవిగారిని కొడుకొనీ—ఆయన పుత్రుడుగారిని కలుసుకోవటం తటస్థించింది ఆరోజు బెంగుళూరులో దిగాము. మహాకవి గృహం బెంగుళూరికి షుమారు పాతిక మైళ్ళ దూరంలో వుంది. అక్కడకు బస్సుమీద వెళ్లాం, అసలే అది బెంగుళూరు, అందులోనూ డిసెంబరుమాసం కావటం మూలాన్ని అనుకుంటాను, మరిఎత చలివేసింది మేమందరమూ మంచి ఉలెన్ స్వెటర్లు వేసకుని బస్సులో బయలుదేరాం . . "

మహాకవి జయంతి సందర్భంలో అధ్యక్షోపన్యాసంలో స్వీయచరిత్ర ఉండాలి కాబోలు అనుకున్నాడు సామాన్యుడు

అధ్యక్షులు ఇంటో వారితో కబుర్లు చెప్తు కుంటున్నాం అనుకున్నారు కాబోలు!

"......అలావెళ్లి మేం ఆపుణ్యస్థలం చేరాం...చుట్టూవున్న దృశ్యం మనోహరంగా వుంది...పచ్చనిగడ్డి చక్కటిచెట్లూ వాటిలో ఎక్కువభాగం ఆపిలుచెట్లని నా జ్ఞాపకం...అవి చూడడానికి చాలబాగున్నాయి. వాటిమధ్య ముద్దులొలికే చిన్న గృహంలో...మహాకవిగారి ప్రపంచఖ్యాతి పొందిన 'నమోనాకు' మొదలయిన పుస్తకాలు చూచాం...ఆరోజు సాయంత్రం...మహాకవి పుత్రులుగారు కమ్మని తుష్పాహోశీతో భోజనం పెట్టించారు..." సాంబశివం గట్టిగా ఏదో అరుదామని అనుకున్నాడు కానీ, సాహిత్యప్రభావం_ఒక్క ఊపిరితప్ప మరేమీ అడ్డంలేదు.

"...ఆయన మహాకవి; నిజంగానే మహాకవి; అందులో సందేహ మేమిలేదు. ఆయన ఒక్క కథలే గాదు, నవలలు రాశాడు; నవలలే కాదు, నాటకాలని సృష్టించాడు, గేయాల్ని కురిపించాడు. ఆయన జాతీయ ముని; అంతర్జాతీయ సాహితీ ఖని. ఆయన రచనలకు భాషాబంధాలు లేవు. మన మందరమూ ..." అధ్యక్షోపన్యాసం అనర్గళంగా సాగిపోతూ వుంది. సాంబశివం తానున్న చోటూ, వింటున్న మాటా మరచిపోవడానికి నాందిగా పదిహేడుపాతికలు ఎంతా అని లెక్క కడుతున్నాడు మనసులో. .

"...వాతర్వాత ఇద్దరు మాట్లాడవలసి వున్నది. నేనే రమారమి గంట తీసుకున్నాను; మీకూ బస్సులకు వేళవుతూ వుంది. ఇంకా కొన్ని విషయాలున్నాయి. వాటిని నేను చెప్పడం మొదలెడితే..."

"– మేం రేపొద్దున బస్సెక్కాల్సిందే" అని సాంబశివం గొణిగిన వాక్యం అధ్యక్షోపన్యాసానంతర ప్రోతల ఘనతర కరతాళధ్వనులలో లీనమయిపోయింది.

అధ్యక్షులు కూర్చున్నారు; శ్రీమతి సుకుమారి నిలబడింది.

ఆమెపాదంనుంచీ నడుమువరకూ లంబ రేఖఅనీ, నడుముపైభాగపు కోణం 67°లో లేక 68° లో వుంటుందనీ సాంబశివం తన మనస్సులో ప్రొట్రాక్టరుకు కాస్త్రముప్పు వదిలించాడు.

"...హూ...హు...మహాకవిగారి స్త్రీ పాత్రలున్నాయి చూశారూ...అవి ఖటావ్ వాయిల్స్‌లాగ...ఫిన్లేమిల్లులాగ ... సున్నితంగా లాలిత్యంగా వుంటాయి. అలాటి పాత్రలను ఆయన ఒక్కడే సృష్టించగలిగాడు. ఆ పాత్రలను ఒక్కసారి చదివితే మళ్ళీ మర్చిపోలేము. అగాధమయిన స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోవడానికి యత్నించి ఆయన చాలవరకు కృతకృత్యుడయాడు. ఉదాహరణకి ఆయన రచించిన "సంఘర్షణ" లోని ఊర్మిళ భారత నారీత్వాన్ని ఎత్తిచూపే పాత్ర – 'మనోరమ' లోని మనోరమ మన ఎదని కదిలించివేసుంది ... 'భగ్నవీణ' లోని శశికళా సురేఖలు మన హృదయాన్ని ఆపేస్తారు. "సుడిగుండం" లోని సుమతి స్త్రీలోని మాతృత్వాన్ని వెలుగులోకి తీసుకొస్తుంది... "అభాగ్యుడు" కథలోని గీత స్త్రీస్వభావం లోని వైవిధ్యాన్ని చూపకుండానే చూపుతుంది... 'సమర సంరంభం'లోని ..." సుకు



"నీలు తేబోతుంటె,
నీతోడ ఓలమ్మి—
నా వెనక ఎవరోను
నడిసి నట్టుంటాది!"
—ఫోటో. ఎ. ఆర్ బోనెపల్లి (రేపల్లె)

# సాహిత్యవీధిలో ఓ సాయంకాలం

మారిగారి ఈ పట్టీ వింటున్న సాంబానికి ఒకటో తారీఖురాత్రి జ్ఞాపక మొచ్చింది. ఆరోజు అతనికి జీతం వచ్చేవుంటుందని తెలిసిన అతనిభార్య రాధ రాత్రి పడక గదిలో "ఒక్క శేరు కందిపప్పు...అర్ధవీశె చింతపండు...రెండున్నరపలాలు జీడిపప్పు ...అణా విలకులు..." అంటూ ఆ నెల రోజులకీ కావలసిన వస్తుసామగ్రిలిస్టు ఇస్తూ వుంటుంది.

సుకుమారి స్వరం సన్నగిల్లుతూ వుండడం ముగింపుకు సమీపమని తోచిన సాంబానికి బతుకుదామనేఆశా, ఉత్సాహమూ కొంత వచ్చినవి.

"...కాబట్టి ఆలాటి పాత్రలు మనదైనం దినజీవితంలో చూడగలమా, చూస్తే ధన్యులం అన్నటువంటిపాత్రలను సృష్టించిన ఆయన మనందరికీ చిరస్మరణీయుడు"—అని సుకుమారి ముగించడం చేతులు ఎర్రబడేవరకూ శ్రోతలు (సుకుమారి ప్రసగించినంతసేపూ వీరిలో కొందరు ఉత్త "ప్రేక్షకులు"గానే ఉండకపోలేదు) చప్పట్లు కొట్టడమూ, సాంబం మొహంలో కొత్త కళ ప్రవేశించడమూ వెన్వెంటనే జరిగాయి.

ఆ తర్వాత నెహ్రూచొక్కా కాలర్ సర్దుకుంటూ ప్రారంభించారు— మహాకవి గీతాలమీద దాడి.

"......ఆయన ప్రతి గీతంలో ఒక [illegible]ం...ప్రతీపాదంలో ఒక పవిత్రతా [illegible]న్నాయి......ప్రశాంత తేజం, వినూత్న భావం వెల్లివిరియడం ఆయన ఒక్కరిగీతాల సొత్తు...ఆయన తర్వాత ఇంతవరకూ అట్టి రచనలు సలిపినవారెవరూ లేరు......అట్టి ఆయన గీతాలను, అర్థం పర్థంలేకుండా నేడు అనేకులు పాడి ఖూనీచేస్తున్నారు... ప్రతీ రెండోవాడూ మహాకవి గీతాలను పాడేవాడే...."

అయితే ప్రతీ మొదటివాడూ ఆ పాడే రెండోవాణ్ణిమాసి కడుపుమంటబడి సాహితీ సభలో అక్కసు కక్కేవాడన్నమాట అనుకున్నాడు సాంబశివం.

"......ఇదిగో...ఇది ఆయనగీతాల్లోకెల్లా ఉత్తమమయినదీ భావపుష్టిగలదీను— ఇది ప్రపంచంలోని అనేకభాషల్లోకి అనువదింపబడింది...ఐన్‌స్టీన్ మొదలు, బడి అయ్యవారిదాక ఈ పాటవిని తలలూపని వారులేరు... దానినే ఇప్పుడు పాడుతున్నా..."అని నెమ్మదిగా మొదలుపెట్టి క్రమకల్గించి... హెచ్చుస్థాయిలో ముగించాడు. శ్రోతలు 'హాయ్‌హోయ్' అన్నారు.

"బాగా నేపాడేడే!" అని విస్తుపోయాడు సాంబంకూడా.

ఈహడావిడిలో...గీతం పాడుతూపాడుతూ బృందావన్ సుకుమారివంక చూడడం, సుకుమారిఏదో చెప్పకుండాచెప్పడంచూచిన సాంబశివం ప్రక్కనే వున్న సుందరాన్ని గిల్లేడు. "ప్చ్! ఇంతేనటోయ్" అన్నట్టు చూసి వూరుకున్నాడు 'సుర'!

"...మహాకవిగారి ఒక్కొక్క గీతమూ మనసాహితీ క్షేత్రంలో ఒక్కొక్కమైలురాయి...కవిత్వమంటే ఆయనదే... కవి అంటే ఆయనే...నేడు అనేకులు రాస్తున్నట్టుఅర్థమూ ఆశయమూ లేని కవితకాదు ఆయనది. ఆయన కలంనుండివచ్చిన ప్రతీ గీతం కలకాలం మన్నుతుంది. తప్పకుండా మన్నుతుంది; అందుకు సందేహంలేదు."

మూర్‌మార్కెట్టులో ఫౌంటెన్ పెన్ వ్యాపారి ఇస్తున్న 'గ్యారంటీ'లాగుంది— అని ఏడవలేక నవ్వాడు సాంబశివం.

"...కానీ ఈనాటి కవుల గేయాలూ గీతాలూ ఉన్నాయి చూశేరూ, అవి ఉత్త పిడుగులూ మెరుపులూ మాత్రమే! అవి ఇవాళ ఉంటాయి. రేపటికి కనుపించవు. కాలప్రవాలతలో నిలబడగల విలువలు వాటికి లేవు;..." అని బట్టతల బృందావన్‌గారంటుంటే-వయస్సుమళ్ళిన, ఎముకలు కుళ్లిన...!"అని సాంబశివం "బ్రెయిన్‌లో బ్రెన్‌గన్" కాల్పులు కాల్చింది. సాంబశివంతలకుచేతులొచ్చాయి.

ఇంతలో చప్పట్లూ.ఖద్దరాయన "..మహామహా పండితులూ కవులూ, విచ్చేసినందుకు సంతసం...మీకందరికీ నా వందనం" అని అనడమూ విన్న సాంబం "మహాప్రసాదమ"ని లేచాడు. చేతివాచీ తొమ్మిదిన్నర చూపించింది. "చక్రపాణి సినిమా చూసినా మూడుగంటలు వృథా పోకపోను" అనుకున్నాడు.

"నీవు బయటవుండు. నేను వారితో మాటాడివస్తాను." అని సాంబశివంతో చెప్పి సుందరం ఆ 'వారి'వైపు నడిచాడు.

కొత్త సాహిత్యపువాసన లేని గాలి పీలుద్దామని బయటకొచ్చి నుంచున్నాడు సాంబశివం.

తాను ఇక్కడకొచ్చి విన్నదేమిటా అని నెమరు వేసుకున్నాడు సాంబశివం. ఒకటి- "బహుశా, సుమారు, రమారమి, కోట్లో"లు ఛందోహ సూదకమైన పదాలతో నిండిన అధ్యక్షుని స్వీయచరిత్ర.

రెండు—తనభార్య లిస్టుకన్న కొంత మెరుగనిపించే శ్రీమతి సుకుమారి 'పాత్ర'ల లిస్టు.

మూడు—మహాకవి గీతాల మన్నికకు 'గ్యారంటీ' ఇస్తూ వాటిని ప్రతీ 'రెండో' వాడూ పాడేస్తున్నాడో అని వాపోగా, బృందావన్‌గారు ఒక్కరాగంతో పాడిన ఒక్కగీతం - ఒకమైలు రాయి - ఇవీ తాను విన్నవి - అని తేల్చుకున్నాడు సాంబశివం. వీటన్నిటి వెనుకా—ఏనాడో చచ్చిపోయి కూడా, ఈనాడు ఇంతమంది సాహిత్య సభలో కుర్చీలలో కూర్చుని "కూల్ డ్రింక్"లు త్రాగడానికి కారణభూతుడైన మహానుభావుడు ... ఆ మహాకవీంద్రుడు లీలగా కనుపించాడు సాంబశివానికి.

"రావోయ్ పోదాం! అందరూ వెళ్ళిపోయారు" సుందరం పిలిచాడు. వాళ్లిద్దరూ నడుస్తున్నారు.

వీధిలో బొత్తిగా జనసమ్మర్దం లేదు. ఫుట్‌పాత్ మీద పడుకున్నవారి మూలుగులూ, గుర్రు—ఎక్కడనుండో వినపడుతున్న కుక్కల అరుపులూ...ఇవే శబ్దాలు. వీధి లాంతరుయొక్క ఇరవైఐదు కాండిల్స్ బల్బు, ఎన్. జి. ఓ. జీతంలా చాలీచాలని కాంతి నిస్తోంది.

"ఎలా వుందోయ్ 'జయంతీ'? 'గ్రాండ్'గా లేదూ?" అన్నాడు సుందరం.

'ఆ' అన్నాడు సాంబశివం—"సార్ ! ఒరం" అన్న కేకవిని పక్కకి తప్పుకుంటూ. రిక్షా దాటింది. సభలో ఉపన్యసించిన వారి సంస్కారాన్నీ పాండిత్యాన్నీ సుందరం ఏకరువు పెడుతున్నాడు.

"అబ్బ! మీమీద నాకు ఎంతకోపం వచ్చిందనుకున్నారూ?"—ముందు పోతూన్న రిక్షాలో స్త్రీకంఠం. సాంబశివం తటాలున తలెత్తి రిక్షావంక చూచాడు.

"ఎందుకూ?" లాలనగా పురుషకంఠం— రిక్షాలోనుండే.

రిక్షావాడుపరుగెత్తడం మొదలుపెట్టాడు.

"నాకు ఇష్టంలేని ఆ గీతాన్నే ఎందుకు పాడేరూ?"...దూర దూరంగా వెళ్ళిపోతూన్న స్త్రీ కంఠం.

సాంబశివం 'షాక్' తిన్నవాడిలా ఆగిపోయాడు. ★

హకల్ బెరిఫిన్
వెల 2-0-0
పోస్టుఖర్చు ప్రత్యేకం.
ఆంధ్ర గ్రంథమాల,